www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
28 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 291

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## తెలంగాణ ప్రతిబింబంగా గ్లోబల్ సమ్మిట్

- డిసెంబర్ 7–9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు
- 550కు పైగా దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు
- అక్టోబర్ 29న ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం
- రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం
- యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ భవిష్యత్తును మార్చే భారీ పెట్టుబడుల వేట మొదలైంది! రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2026 ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సు కేవలం పారిశ్రామిక సమావేశానికే పరిమితం కాకుండా, తెలంగాణ ఆర్థిక భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే వేదికగా మారాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. దేశీయ, అంతర్జాతీయ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే పెట్టుబడుల ఆకర్షణ కోసం వివిధ నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తన ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తోంది. ఈ సమ్మిట్ విజయవంతమైతే రాష్ట్ర పారిశ్రామిక

మిగతా 2లో..



## రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

### తెలంగాణలో కృత్రిమ కరువుకు రేవంత్ కారణమని కేటీఆర్ ఆరోపణ

- గోదావరి, కృష్ణా జలాలను వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కాళేశ్వరం పంపులు నడపక రైతులకు అన్యాయం చేశారని మండిపాటు
- రైతుబంధు, విద్యుత్, యూరియా కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత
- మూసీ సుందరీకరణ కంటే సాగునీటికే ప్రాధాన్యమివ్వాలని డిమాండ్
- కాంగ్రెస్ పాలనకు రైతులే సమాధానం చెబుతారని కేటీఆర్ వ్యాఖ్య

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో సాగునీటి అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేస్తోంది. రాష్ట్రంలో నదులు పారుతున్నా పొలాలకు నీళ్లు అందడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో ఏర్పడింది ప్రకృతి కరువు కాదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యంతో వచ్చిన కరవు అని ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ సాగునీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఈ విమర్శలను ఖండిస్తూ, కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. దీంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు, సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం చుట్టూ రాజకీయ చర్చ మళ్లీ మొదలైంది. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో రైతులు

మిగతా 6లో..



## రేవంత్! టెక్నాలజీ వాడు

- జవహర్‌నగర్ డంప్‌యార్డును తొలగించే వరకు పోరాటం చేస్తాం
- డంప్‌యార్డు సమస్య పరిష్కారానికి రూ.3,000 కోట్లు ఖర్చు చేయాలి
- ప్లాస్టిక్‌తో డాంబర్, చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు
- రెండేళ్లయినా సమస్యపై స్పందన లేదని సీఎం రేవంత్‌పై విమర్శలు
- డంప్‌యార్డు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన
- నాలుగు రోజుల పాటు బీజేపీ ఆధ్వర్యంలో పాదయాత్ర

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ శివార్లలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడి చెత్త కుప్పల మధ్య జీవిస్తున్న ప్రజల కష్టాలు, పర్యావరణ సమస్యలు, ఆరోగ్యపరమైన ఆందోళనలను ప్రస్తావిస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమయం కేటాయించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తే చెత్తను సమస్యగా కాకుండా సంపదగా మార్చవచ్చని,

మిగతా 3లో..

## ఆరోగ్యశాఖలో అవినీతి దందా

- భగ్గుమంటున్న తెలంగాణ వైద్యాధికారులు
- డిప్యుటేషన్ ముసుగులో పోస్టులు అమ్ముకుంటున్నరు
- సరోజినీదేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్ బదిలీ
- మూడు నెలలకే మళ్లీ డిప్యుటేషన్‌పై వచ్చి బాధ్యతలు
- సనత్‌నగర్ టిమ్స్‌లో సైతం.. పెద్ద ఎత్తున అక్రమాలు
- భగ్గుమంటున్న తెలంగాణ వైద్యాధికారులు



02

## బీఆర్ఎస్ హాజరవుతుందా?

### కరువు పరిస్థితులపై భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష భేటీ

### తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావంపై ప్రభుత్వ ఆందోళన

రైతులకు సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరాపై సమీక్ష

ప్రత్యామ్నాయ పంటలు, రైతులకు ఆర్థిక సాయంపై కార్యాచరణ

కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోసం ఉమ్మడి ప్రయత్నాలపై చర్చ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వర్షాలు తగ్గితే మొదట కనిపించే ప్రభావం పొలాల్లోనే అయినా.. ఆ తర్వాత దాని సెగ రాష్ట్ర వ్యాప్తంగా తగిలే ప్రమాదం ఉంటుంది. వర్షపాతం లోటుతో చెరువులు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే సాగునీటి లభ్యత ప్రశ్నార్థకమవుతుంది. భూగర్భ జలాలు అడుగంటితే బోర్లు, బావులపై ఆధారపడే రైతులకు కష్టాలు మరింత పెరుగుతాయి. తాగునీటి అవసరాల కోసం గ్రామాలు, పట్టణాలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సి రావచ్చు. పశువులకు మేత, నీటి కొరత ఏర్పడే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని ఎక్కడ, ఎంత మేర వినియోగించాలి? తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూనే సాగుకు ఎలా భరోసా కల్పించాలి? నీటి వృథాను ఎలా అరికట్టాలి?

మిగతా 2లో..

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు.. రైతాంగాన్ని కరవు భయాలు వెంటాడుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే వ్యవసాయం, తాగునీటి సరఫరా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఎదురయ్యే ఇబ్బందులేంటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి సిద్ధమైంది. కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజకీయాలకు అతీతంగా కార్యాచరణ రూపొందించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ సమావేశం కేవలం చర్చలకే పరిమితమవుతుందా? క్షేత్రస్థాయిలో ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు వెలువడతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## కాంగ్రెస్ మిషన్ 100..!

- నవంబర్ తర్వాత ఎన్నికల కార్యాచరణకు సిద్ధం
- వచ్చే ఎన్నికల్లో 100 సీట్లే కాంగ్రెస్ లక్ష్యం
- బీఆర్ఎస్‌పై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
- రేవంత్‌రెడ్డితో విభేదాలు లేవని స్పష్టత
- ఆదిలాబాద్, నిజామాబాద్‌లో పుంజుకుంటామని ధీమా
- సంక్షేమ పథకాలతో మళ్లీ అధికారమే కాంగ్రెస్ లక్ష్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతోంది. గత ఎన్నికల్లో సాధించిన విజయాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో మరింత భారీ మెజారిటీతో అధికారాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని హస్తం పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే 100 అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడమే తమ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో

మిగతా 2లో..



రిజ్వీ బాటలో

## మరో ఐఏఎస్ అధికారి?

- జయేష్ రంజన్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసినట్లు ప్రచారం
- అమెరికా సంస్థలో ఉన్నత ఉద్యోగం వచ్చినట్లు సమాచారం
- 2027 సెప్టెంబరులో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది
- తెలంగాణ ఐటీ, పరిశ్రమల రంగాల్లో కీలకంగా పనిచేశారు
- గతంలో ఐఏఎస్ రిజ్వీ కూడా వీఆర్ఎస్ తీసుకుని ప్రైవేటు రంగంలోకి..

06

## రాజకీయాల్లోకి ధనుష్

- ధనుష్ రాజకీయాల్లోకి వస్తారంటూ తమిళనాట జోరుగా ప్రచారం
- ఢిల్లీ పర్యటనతో రాజకీయ వ్యూహాలపై ఊహాగానాలు పెరిగాయి
- అభిమాన సంఘాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం
- మహిళా ప్రతినిధులతో సమావేశం రాజకీయ చర్చకు దారితీసింది
- యువత, మహిళల మద్దతు ధనుష్‌కు ప్రధాన బలంగా మారే అవకాశం
- పార్టీ స్థాపనపై అధికారిక ప్రకటన వస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది

**విశాలభారతి, జాతీయం:**

తమిళనాడు రాజకీయాలంటే సినిమా రంగాన్ని పక్కన పెట్టి చూడలేం. వెండితెరపై ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్న పలువురు నటులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజల మద్దతుతో అధికార పీఠాలను అధిరోహించారు. ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజాల నుంచి విజయకాంత్ వరకు ఈ ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. ఇప్పుడు దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీతో రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపారు. ఇదే సమయంలో నటుడు ధనుష్ పేరు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తుండటం ఆసక్తికరంగా మారింది. ఆయన రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారానికి అభిమాన సంఘాల కార్యకలాపాలు, సామాజిక సేవా కార్యక్రమాలు మరింత ప్రాధాన్యం తీసుకొస్తున్నాయి. అయితే ధనుష్ నిజంగానే రాజకీయ అరంగేట్రానికి సిద్ధమవుతున్నారా? లేక అభిమానుల బలాన్ని



మిగతా 2లో..

## తాండూరు కందులకు ఎల్‌నినో దెబ్బ!

### ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. ఎండుతున్న పంటలు

వికారాబాద్ జిల్లాలో 1.11 లక్షల ఎకరాల్లో కంది సాగు

వర్షాలు లేక దిగుబడిపై రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

తాండూరు కందులకు 2022లో జీఐ ట్యాగ్ గుర్తింపు

నీరు అందక పంట నష్టపోతున్న రైతులకు తప్పని కష్టాలు

కంది పంట తొలగించి శనగ సాగు చేస్తున్న రైతులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వర్షాలు కురుస్తాయని ఆశతో విత్తనాలు వేశారు.. పంట చేతికొస్తే అప్పులు తీరి, కుటుంబానికి అండగా ఉంటుందని ఆశపడ్డారు. కానీ ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. పంటలకు నీరు అందక పొలాలు ఎండిపోతుండటంతో, చేసేదేమీ లేక కొందరు రైతులు తమ పంటలను పశువులు, మేకలకు మేతగా వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కళ్లముందే బూడిదవుతుంటే రైతన్నల

మిగతా 2లో..

## ఆరోగ్యశాఖలో అవినీతి దందా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మూడు నెలల క్రితమే రాష్ట్రవ్యాప్తంగా వైద్యాధికారుల బదిలీలు జరిగాయి.ఈ బది'లీలలు'ల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా సరోజినీ దేవి కంటి దవాఖానలో సూపరింటెండెంట్ గా పనిచేసిన డా.మోదిని సాధారణ బదిలీల్లో భాగంగా మూడు నెలల క్రితమే నల్గొండ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో నల్గొండ నుంచి డా.సాంబశివారెడ్డికి సరోజిని దేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్ గా పోస్టింగ్ కల్పించారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు కథ ఇప్పుడే మొదలైంది. ఎవరు చక్రం తిప్పారో, ఎంత బరువు తూగిందో తెలియదు గాని మూడు నెలలు గడవగానే నల్గొండకు బదిలీ అయిన డా .మోదిని మళ్లీ సరోజిని దేవి కంటి దవాఖానకు డిప్యుటేషన్ పై వచ్చారు. వైద్య చరిత్రలోనే తొలిసారిగా డిప్యుటేషన్ పై వచ్చిన అధికారికి సూపరింటెండెంట్ పగ్గాలు అప్పగించడంపై యావత్ తెలంగాణ వైద్యాధికారులు భగ్గుమంటున్నారు. ఆరు నెలల వరకు ఎలాంటి డిప్యుటేషన్లు ఉండవని ఇటీవల జారీచేసిన సాధారణ బదిలీల ఉత్తర్వుల్లో ప్రత్యేకంగా పేర్కొన్నప్పటికీ వారు జారీచేసిన నిబంధనలను వారే తుంగలోకి తొక్కడంపై వైద్య వర్గాలు మండిపడుతున్నాయి. బదిలీ అయిన మూడు నెల్లో మళ్లీ డిప్యుటేషన్ ఇవ్వడం ఒక తప్పు అయితే, వర్క్ డిప్యుటేషన్ పై వచ్చిన అధికారికి సూపరింటెండెంట్ పోస్టును ఎలా కట్టబెడతారని తెలంగాణ ప్రభుత్వ వైద్యులు ప్రశ్నిస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ చరిత్రలోనే ఇలా ఎన్నడూ జరగలేదని, డిప్యుటేషన్ పై వచ్చిన అధికారులు, లేదా సిబ్బందికి సాధారణ పోస్టులు అప్పగిస్తారని, ఇలా పరిపాలన పరమైన కీ పోస్టులను అప్పగించడం ఇంతవరకు తాము కనీవిని ఎరగమంటున్నారు వైద్యులు. ఒక వేళ ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్ పై ఏవైనా ఆరోపణలు లేదా ఇతరాత్ర అంశాలు ఏమైనా ఉంటే ఆయనను తప్పించి ఆ తరువాత ఉన్న సీనియర్ అధికారికి సూపరింటెండెంట్ పోస్టును అప్పగించాలి తప్పా నిబంధనలకు పూర్తి విరుద్ధంగా అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారులు తమ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూ రోగులను, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైద్యులు మండిపడుతున్నారు.

# తాండూరు కందులకు ఎల్‌నినో దెబ్బ!

మొదటి పేజీ తరువాయి



గుండెల్లో ఆవేదన రగులుతోంది. ముఖ్యంగా తక్కువ నీటితో సాగు చేయగల కంది పంటకు కూడా ఈ పరిస్థితి తప్పడం లేదు. తెలంగాణలో కంది సాగుకు ప్రసిద్ధి చెందిన వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యాలు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. వికారాబాద్ జిల్లా అంటేనే కంది సాగుకు ప్రత్యేక గుర్తింపు. ముఖ్యంగా తాండూరు ప్రాంతంలో పండే కందులకు దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయంగానూ మంచి డిమాండ్ ఉంది. ఈ పంట నాణ్యతకు గుర్తింపుగా 2022 డిసెంబర్‌లో తాండూరు కందులకు భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ లభించింది. ఇంతటి ప్రత్యేకత ఉన్న పంటను సాగు చేసిన రైతులకు ఈసారి మాత్రం నిరాశే ఎదురవుతోంది. 202526 సంవత్సరంలో జిల్లాలో 1.67 లక్షల క్వింటాళ్ల కంది దిగుబడి నమోదైనప్పటికీ, ప్రస్తుత సాగు సీజన్‌లో వర్షాభావం పరిస్థితిని తలకిందులు చేస్తోంది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా సుమారు 1.11 లక్షల ఎకరాల్లో కంది సాగు చేపట్టారు. అయితే పంట ఎదిగే కీలక దశలో తగినంత వర్షం కురవకపోవడంతో అనేక ప్రాంతాల్లో మొక్కలు ఎండిపోతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు కురవకపోతే మిగిలిన పంట కూడా చేతికి అందకుండా పోతుందనే భయం రైతులను వెంటాడుతోంది. కంది పంటకు ఇతర పంటలతో పోలిస్తే నీటి అవసరం తక్కువే. అయినప్పటికీ, కీలక దశల్లో నేలలో తేమ తగ్గిపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రస్తుతం వికారాబాద్, కొడంగల్, పరిగి ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వికారాబాద్ మండలంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న పొలాల్లోనూ పంటలు ఎండిపోతున్నాయి. నీటి వనరు దగ్గరలోనే ఉన్నా, సాగుకు అవసరమైన సమయంలో నీటిని అందించలేని పరిస్థితి రైతుల కష్టాలను మరింత పెంచుతోంది. మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కూడా సాగునీటి వినియోగానికి అడ్డంకిగా మారుతున్నాయి. వర్షాలు లేకపోవడం ఒక సమస్య అయితే, అందుబాటులో ఉన్న నీటిని సకాలంలో పొలాలకు చేర్చుకోలేకపోవడం మరో సమస్యగా మారింది. దీంతో పెట్టుబడులు పెట్టిన రైతులు పంటను కాపాడుకోవాలా, నష్టాన్ని తగ్గించుకోవాలా అన్న సందిగ్ధంలో పడుతున్నారు. వికారాబాద్ జిల్లా గొట్టిముక్ల గ్రామానికి చెందిన రైతు బి. జంగయ్య పరిస్థితి ఈ సంక్షోభానికి ఒక ఉదాహరణ. ఒక ఎకరంలో కంది సాగు చేసేందుకు సుమారు రూ.40 వేలు ఖర్చు చేశారు. మంచి దిగుబడి వస్తుందన్న ఆశతో పంటను పెంచినా, చివరకు నీటి కొరత కారణంగా పంట పూర్తిగా ఎండిపోయింది. ఆయన పొలం పక్కనే చిన్న వాగు ఉన్నప్పటికీ, విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో నీటిని అందించలేకపోయారు. పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో, చివరకు కంది పంటను తొలగించి శనగ సాగు చేపట్టాల్సి వచ్చింది. చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇక కంది పంట కోలుకునే అవకాశం లేదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. జంగయ్య ఒక్కరి పరిస్థితి మాత్రమే కాదు.. వర్షాభావంతో నష్టపోతున్న అనేక మంది రైతుల ఆవేదనకు ఇది ప్రతిరూపం. ఒక పంట కోసం చేసిన ఖర్చు, శ్రమ వృథా కావడంతో పాటు మరో పంట సాగుకు మళ్లీ పెట్టుబడి సమకూర్చుకోవాల్సిన పరిస్థితి వారిపై అదనపు భారాన్ని మోపుతోంది. అయితే, ఈ సంక్షోభాన్ని కొంతవరకు తగ్గించే అవకాశాలు కూడా ఉన్నాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. తాండూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త సుధారాణి ప్రకారం, పంట పరిస్థితిని బట్టి పొలాలకు ఒకటి లేదా రెండుసార్లు నీరు అందించడం ద్వారా నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చు. అయితే ప్రతి పొలంలోనూ ఒకే విధమైన ఫలితం ఉంటుందని చెప్పలేం. నేలలో తేమ, పంట ఎదుగుదల దశ, అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని బట్టి రైతులు వ్యవసాయ అధికారుల సలహాతో నిర్ణయాలు తీసుకోవాలి. మరోవైపు విద్యుత్ సరఫరాను సాగుకు అనుకూలంగా నిర్వహించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించడం కూడా కీలకం. వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు సకాలంలో సహాయం అందకపోతే నష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు ఉన్నా, వాటిని పండించే రైతుకు ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ లేకపోతే ఆ ప్రత్యేకతకు అర్థం ఏముంటుంది? ఇప్పుడు వికారాబాద్ రైతుల ముందున్న ప్రశ్న ఇదే. పంటను కాపాడుకునేందుకు అవసరమైన నీరు, విద్యుత్, సాంకేతిక సలహాలు సకాలంలో అందితేనే వారి ఆశలకు మళ్లీ జీవం పోసే అవకాశం ఉంటుంది.

## రాజకీయాల్లోకి ధనుష్

మొదటి పేజీ తరువాయి



సామాజిక సేవకు మరింత సమర్థంగా ఉపయోగించుకోవాలనుకుంటున్నారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. తమిళనాడులో రాజకీయ పార్టీని స్థాపించడం ఒక ఎత్తయితే, ప్రజల్లో దానికి బలమైన పునాది నిర్మించడం మరో ఎత్తు. డీఎంకే, అన్నాడీఎంకే వంటి పార్టీలకు దశాబ్దాలుగా ఉన్న సంస్థాగత బలం, స్థానిక నాయకత్వం, కార్యకర్తల నెట్‌వర్క్ గట్టి పోటీని ఇస్తాయి. ఈ నేపథ్యంలో ధనుష్ రాజకీయాల్లోకి రావాలనుకుంటే ముందుగా తన లక్ష్యాన్ని స్పష్టం చేసుకోవాల్సి ఉంటుంది. సొంత పార్టీ ఏర్పాటు చేయాలా? ఇప్పటికే ఉన్న రాజకీయ శక్తులకు మద్దతుగా నిలవాలా? లేక ముందుగా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచుకోవాలా? అనేది కీలకం. ముఖ్యంగా రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, యువత ఆకాంక్షలు, మహిళల అవసరాలను అర్థం చేసుకోకుండా రాజకీయాల్లో నిలదొక్కుకోవడం కష్టం. సినిమా అభిమానాన్ని ఓట్లుగా మార్చాలంటే ఆకర్షణీయమైన ప్రసంగాలు మాత్రమే సరిపోవు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, నిరంతర ప్రజా సంబంధాలు, స్పష్టమైన విధానాలు అవసరం. ధనుష్ అభిమాన సంఘాల కార్యకలాపాలపై వస్తున్న చర్చలో మహిళా విభాగం సమావేశం ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తోంది. చెన్నైలో పెద్ద సంఖ్యలో మహిళా ప్రతినిధులతో సమావేశమై, పండుగ సందర్భంగా సంప్రదాయ దీపాలను అందజేసి, సామాజిక సేవలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కార్యక్రమాలు నిజంగా రాజకీయ వ్యూహంలో భాగమైతే, అభిమాన సంఘాలను క్రమబద్ధమైన ప్రజా సేవా వ్యవస్థగా మార్చాలనే ఆలోచనకు సంకేతంగా చూడవచ్చు. మహిళలు, యువతతో నిరంతరం అనుసంధానమై ఉండటం ఏ రాజకీయ నాయకుడికైనా ఉపయోగపడుతుంది. అయితే ఒకటి రెండు సమావేశాలతోనే బలమైన ఓటు బ్యాంకు ఏర్పడదు. గ్రామాలు, పట్టణాలు, స్థానిక సమస్యల స్థాయిలో సేవా కార్యక్రమాలను కొనసాగించడం, ప్రజల సమస్యలకు స్పందించడం, విశ్వసనీయమైన నాయకత్వాన్ని పెంచడం ద్వారానే దీర్ఘకాలిక ప్రభావం సాధ్యమవుతుంది. ధనుష్‌కు ఉన్న విస్తృత అభిమాన వర్గం ఈ విషయంలో అవకాశంగా మారవచ్చు. నటుడిగా ధనుష్‌కు ఉన్న గుర్తింపు ఆయనకు రాజకీయాల్లో కొంత ప్రారంభ ప్రయోజనాన్ని అందించవచ్చు. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం, జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించడం ఆయన ప్రజాదరణకు బలం. అయితే తమిళ రాజకీయ చరిత్ర మరో విషయాన్ని కూడా గుర్తుచేస్తోంది. సినీ రంగంలో ఎంతటి పేరు ఉన్నా, రాజకీయాల్లో విజయం సాధించడానికి అది ఒక్కటే సరిపోదు. రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై ఎన్నో సంవత్సరాలు చర్చ జరిగినా, చివరకు ఆయన పార్టీ ఏర్పాటు చేయలేదు. కమల్ హాసన్ రాజకీయాల్లో తనదైన మార్గాన్ని ఎంచుకున్నప్పటికీ, ఎన్నికల విజయాన్ని స్థిరమైన రాజకీయ బలంగా మార్చుకోవడం సవాలుగానే నిలిచింది. ఇప్పుడు విజయ్ రాజకీయ ప్రయాణం మరో కొత్త పోటీని సృష్టిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ధనుష్ రంగంలోకి దిగితే యువత, సినీ అభిమానుల ఓట్లపై ప్రభావం పడవచ్చు. కానీ అదే సమయంలో కొత్త పార్టీకి ఓటర్లు ఎంతవరకు మద్దతు ఇస్తారు, ఇప్పటికే బలంగా ఉన్న పార్టీలను ఎంతవరకు ఎదుర్కోగలరు అనేది అసలు పరీక్ష. మొత్తంగా చూస్తే, ధనుష్ రాజకీయ ప్రవేశంపై సాగుతున్న చర్చ ఆసక్తికరమే అయినా, ప్రచారాన్ని అధికారిక నిర్ణయంగా భావించడం తొందరపాటు అవుతుంది. ఢిల్లీ పర్యటనలు, రాజకీయ వ్యూహకర్తలతో భేటీలు, అభిమాన సంఘాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై వస్తున్న వార్తలకు ధనుష్ నుంచి స్పష్టమైన ప్రకటన లేదా విశ్వసనీయ ధ్రువీకరణ లభించే వరకు వాటిని ఊహాగానాలుగానే చూడాలి. ఒకవేళ ఆయన రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకుంటే, ముందుగా ప్రజలకు ఏమి చేయాలనుకుంటున్నారు,

## తెలంగాణ ప్రతిబింబంగా గ్లోబల్ సమ్మిట్

మొదటి పేజీ తరువాయి



రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు, తెలంగాణ బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ప్రభుత్వం భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తోంది. తొలి దశలోనే 550కు పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు అందించగా, ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అక్టోబర్ 29న న్యూఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇప్పటికే నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ రోడ్‌షోలు ఈ ప్రయత్నంలో భాగమే. అయితే, ఆహ్వానాలు అందించడం, సమావేశాలు నిర్వహించడం మాత్రమే పెట్టుబడుల లక్ష్యాన్ని సాధించడానికి సరిపోవు. ఆయా సంస్థలతో నిరంతర చర్చలు జరపడం, వారికి అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతిపాదనలను వాస్తవ పెట్టుబడులుగా మార్చడం అత్యంత కీలకం. అందుకే ఈ సమ్మిట్‌లో కుదిరే ఒప్పందాలు, వాటి అమలు పురోగతి రాష్ట్రానికి ముఖ్యమైన అంశాలుగా మారనున్నాయి. ఈసారి సమ్మిట్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. ముఖ్యంగా రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు వందకు పైగా కంపెనీలు, సంస్థలను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని, అత్యాధునిక సాంకేతికత, తయారీ రంగాల్లో మరిన్ని అవకాశాలను సృష్టించాలనే లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. రక్షణ పరికరాల తయారీ, విమానయాన సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలకు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందితే నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రధాన సమ్మిట్ వేదికను 25 రంగాలుగా విభజించడం ద్వారా వివిధ పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్లీనరీలు, సెమినార్లు, నిపుణుల చర్చలు, పెట్టుబడి ఒప్పందాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కో రంగానికి సంబంధించిన అవసరాలు, అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలపై స్పష్టమైన చర్చలకు అవకాశం లభిస్తుంది. అయితే, ఈ రంగాల్లో పెట్టుబడులు పెరగాలంటే నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, రవాణా సదుపాయాలు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టాల్సి ఉంటుంది. మరోవైపు, అంతర్జాతీయ ప్రతినిధులకు తెలంగాణ ప్రత్యేకతను పరిచయం చేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. రాష్ట్ర సంప్రదాయాలు, కళలు, సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలతో పాటు విదేశీ ప్రతినిధుల రవాణా, వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రతినిధితో సమన్వయం చేసేందుకు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించాలనే ప్రణాళిక కూడా సిద్ధమైంది. ఏర్పాట్లన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ స్థాయి అంతర్జాతీయ సదస్సులో చిన్నపాటి నిర్వహణ లోపాలు కూడా పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, సమన్వయం, సమయపాలన, పారదర్శకత కీలకంగా మారనున్నాయి. ప్రతినిధులకు రాష్ట్రంలో వ్యాపారం ప్రారంభించే విధానాలు, అందుబాటులో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అనుమతుల ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించే వాతావరణం ఏర్పడినప్పుడే అంతర్జాతీయ సంస్థలు దీర్ఘకాలిక ప్రాజెక్టులపై ఆసక్తి చూపే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సమ్మిట్ నిర్వహణతో పాటు, దాని తర్వాత జరిగే కార్యాచరణ కూడా అంతే ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఈ మొత్తం కార్యక్రమానికి కేంద్రబిందువు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వల్ల పరిశ్రమలు విస్తరించడం, కొత్త సంస్థలు ఏర్పడడం, స్థానిక వ్యాపారాలకు అవకాశాలు పెరగడం వంటి ప్రయోజనాలు కలగవచ్చు. అయితే, పెట్టుబడుల ప్రకటనలు నిజమైన ఉద్యోగాలుగా మారినప్పుడే వాటి ప్రభావం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుంది. ఒప్పందాలు ఎంతవరకు అమలవుతున్నాయి, ఎన్ని పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభిస్తున్నాయి, స్థానిక యువతకు ఎంతమేర ఉపాధి లభిస్తోంది అనే అంశాలు ఈ సమ్మిట్ విజయాన్ని అంచనా వేయడానికి ముఖ్యమైన ప్రమాణాలుగా నిలుస్తాయి. అలాగే, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవకాశాలు కల్పించడం, స్థానిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వివిధ ప్రాంతాలకు పారిశ్రామిక అభివృద్ధిని విస్తరించడం ద్వారా పెట్టుబడుల ప్రయోజనాలను విస్తృత ప్రజానీకానికి చేరవేయవచ్చు.

## దుర్గం చెరువులోకి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య!

**ఆత్మహత్య గల కారణాలపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం**

**సైబరాబాద్ - విశాల భారతి**



దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విశాఖపట్నానికి చెందిన రాజేశ్ (25) హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతంలో ఓ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో తన స్నేహితులను కలిసేందుకు వచ్చిన రాజేశ్, అనంతరం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి చెరువులోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజేశ్ సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నారు. మరోవైపు చెరువులో దూకిన రాజేశ్ మృతదేహం కోసం ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కి తరలించారు. అయితే రాజేశ్ ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ హెచ్ఓ కెవి. సుబ్బారావు తెలిపారు.

# కాంగ్రెస్ 'మిషన్ 100'..!

మొదటి పేజీ తరువాయి

చర్చకు దారితీసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తమకు కలిసివస్తాయని కాంగ్రెస్ నాయకత్వం అంచనా వేస్తోంది. అయితే, అధికారంలోకి రావడం ఒక ఎత్తయితే, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అంచనాలను అందుకుంటూ మరోసారి భారీ విజయాన్ని సాధించడం మరో ఎత్తు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధించడమే కాంగ్రెస్ ముందున్న అసలు సవాలుగా కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌పై మహేష్ కుమార్ గౌడ్ చేసిన విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించకుండా గత అధికార ప్రభావంలోనే ఉన్నారని ఆయన ఆరోపించారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల వంటి అంశాలను కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల భారం పెంచుకుందని కేసీఆర్ పాలనను లక్ష్యంగా చేసుకున్నారు. కాంగ్రెస్ వ్యూహాన్ని గమనిస్తే, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తుచేస్తూనే ప్రస్తుత పాలనను ప్రత్యామ్నాయంగా నిలబెట్టాలనే ప్రయత్నం స్పష్టమవుతోంది. అయితే, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని అందించదు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించిందా లేదా అన్నదే చివరకు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే కీలక అంశం కానుంది. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయంపై వస్తున్న చర్చలకు కూడా పీసీసీ అధ్యక్షుడు తెరదించే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పార్టీ వ్యవహారాల్లో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ఇద్దరి మధ్య మంచి సమన్వయం కొనసాగుతోందని వెల్లడించారు. నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు.



నవంబర్ నెలాఖరు నాటికి ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ప్రకటించడం, ఆ తర్వాత పార్టీని పూర్తిస్థాయి ఎన్నికల కార్యాచరణలోకి తీసుకెళ్తామని చెప్పడం కాంగ్రెస్ ప్రణాళికలో కీలక అంశాలుగా కనిపిస్తున్నాయి. పార్టీ సంస్థాగత బలం తమకు ప్రధానమైనదని ఆయన చెప్పడం వెనుక క్షేత్రస్థాయిలో కార్యకర్తలను చైతన్యవంతం చేయాలనే ఉద్దేశం ఉంది. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేయడం, నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిస్థితులను అంచనా వేయడం వంటి అంశాలపై కాంగ్రెస్ మరింత దృష్టి సారించే అవకాశం ఉంది. మరోవైపు, తెలంగాణలో అధికారంలోకి వస్తామంటున్న బీజేపీపై కూడా మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న లోక్‌సభ ఎంపీలు, అసెంబ్లీ ఎమ్మెల్యేల సంఖ్యను ప్రస్తావిస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శనపై తన అంచనాలను వెల్లడించారు. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో బీజేపీకి ఉన్న బలాన్ని తగ్గించి, అక్కడ గణనీయమైన సంఖ్యలో అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ ప్రాంతాల్లో కాంగ్రెస్ పుంజుకోవడం సాధ్యమైతే రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి రాజకీయంగా ప్రయోజనం కలగవచ్చు. అయితే, బీజేపీకి ఉన్న ఓటు బ్యాంకు, స్థానిక నాయకుల ప్రభావం, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. అందువల్ల ప్రత్యర్థుల బలాన్ని తక్కువగా అంచనా వేయకుండా, నియోజకవర్గాల వారీగా పక్కా వ్యూహంతో ముందుకు సాగడం కాంగ్రెస్‌కు అవసరం. 100 సీట్ల లక్ష్యం నెరవేరాలంటే రాష్ట్రవ్యాప్తంగా సమానమైన రాజకీయ బలాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ తన విజయావకాశాలకు సంక్షేమ పథకాలనే ప్రధాన ఆధారంగా చూపిస్తోంది. అర్హులైన పేదలకు సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉద్యోగ నియామకాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది. దాదాపు 90 వేల ఉద్యోగాలు కల్పించామన్న వాదనను కూడా తన పాలనకు అనుకూలంగా ప్రస్తావిస్తోంది. ఈ పథకాల ప్రయోజనాలు ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయి, వాటి అమలుపై లబ్ధిదారుల్లో ఎలాంటి అభిప్రాయం ఉంది, పెండింగ్‌లో ఉన్న హామీలను ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుంది అనే అంశాలు వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన 100 సీట్ల లక్ష్యం కాంగ్రెస్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నప్పటికీ, ఆ లక్ష్యాన్ని వాస్తవంగా మార్చాలంటే ప్రకటనలను ప్రజా ఫలితాలుగా మార్చాల్సి ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధి, పార్టీ ఐక్యతతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం చూపగలిగితేనే హస్తం పార్టీ తన లక్ష్యానికి చేరువయ్యే అవకాశం ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అసలైన పరీక్ష ప్రత్యర్థులను విమర్శించడంలో కాదు, ప్రజల నమ్మకాన్ని మరోసారి ఓట్లుగా మార్చుకోవడంలోనే ఉండనుంది.

# బీఆర్ఎస్ హాజరవుతుందా?

మొదటి పేజీ తరువాయి

వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. సంక్షోభం తీవ్రమయ్యే వరకు వేచి చూడటం కంటే ముందుగానే ప్రమాదాన్ని అంచనా వేసి చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనం. ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవడమే ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారనుంది. వర్షాభావం కారణంగా విత్తనాలు, ఎరువులు, సాగు ఖర్చులు పెట్టిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే పంటలు వేసిన ప్రాంతాల్లో నీటి లభ్యతను అంచనా వేయడంతో పాటు, తదుపరి సాగు ప్రణాళికపై వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకోవడం కీలకం. నీటి కొరతను తట్టుకునే పంటల వైపు రైతులను ప్రోత్సహించడం, పంటల మార్పిడిపై అవగాహన కల్పించడం, అవసరమైన చోట ప్రత్యామ్నాయ విత్తనాలు అందించడం వంటి చర్యలు ఉపయోగపడతాయి. అదే సమయంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా, సాగునీటి పంపిణీపై సమన్వయం అవసరం. పంట నష్టం జరిగితే పరిహారం, బీమా పరిష్కారాలు, రుణాల విషయంలో ఉపశమనం వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ప్రకటనలతో రైతులకు భరోసా కల్పించడం ఒక ఎత్తయితే, ఆ సాయం సరైన సమయంలో అర్హులైన రైతులకు చేరేలా చూడటం మరో కీలకమైన బాధ్యత. అఖిలపక్ష సమావేశం ప్రాధాన్యత ఇక్కడే పెరుగుతోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడిస్తే సమస్య తీవ్రతను విస్తృతంగా అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వాస్తవ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, తాగునీటి ఇబ్బందులపై ప్రతిపక్షాలు తమ సూచనలు అందించవచ్చు. అయితే, సమావేశానికి బీఆర్ఎస్ హాజరవుతుందా లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పాల్గొనే అవకాశాలున్నాయన్న చర్చ సాగుతోంది. కానీ అధికారిక ప్రకటన వెలువడే వరకు దీనిపై ఖచ్చితమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై ఏకాభిప్రాయం సాధించగలిగితేనే ఈ సమావేశం ఉద్దేశం నెరవేరుతుంది. కరవు అనేది ఒక పార్టీకి సంబంధించిన సమస్య కాదు.. దాని ప్రభావం రైతులు, కూలీలు, సామాన్య కుటుంబాలందరిపైనా పడుతుంది. మరోవైపు, తక్షణ ఉపశమన చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళిక కూడా అత్యవసరం. వర్షాలు తగ్గిన ప్రతిసారీ నీటి సంక్షోభం తలెత్తకుండా చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, సూక్ష్మ సేద్య పద్ధతుల విస్తరణపై దృష్టి పెట్టాలి. జిల్లాలవారీగా నీటి లభ్యత, పంటల పరిస్థితి, తాగునీటి అవసరాలను అంచనా వేసి కార్యాచరణ రూపొందించడం ప్రయోజనకరంగా ఉంటుంది. పరిస్థితులు తీవ్రంగా మారితే కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సాయం కోరేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి. అయితే, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు ఆధారంగా కరవు తీవ్రతను ముందుగానే ఖరారు చేయలేం.





## దీపావళి టపాసుల విక్రయాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

- నవంబర్ 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి సిపి ఏం.రమేష్

సైబరాబాద్ - విశాల భారతి

దీపావళి పండుగ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలికంగా బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా పోలీసుల నుంచి లైసెన్స్ పొందాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సూచించారు. పేలుడు పదార్థాల చట్టం 1884, నిబంధనలు 1983 (2008 సవరణలతో) ప్రకారం సంబంధిత జోన్ల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసక్తి గల వ్యాపారులు నవంబర్ 7, 2026లోగా cybpms.telangana.gov.in లేదా www.cyberabadpolice.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను స్వీకరించబోమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# రేవంత్! టెక్నాలజీ వాడు

మొదటిపేజీ తరువాయి

ప్లాస్టిక్‌తో రోడ్ల నిర్మాణానికి అవసరమైన డాంబర్ తయారు చేయడంతో పాటు వ్యర్థాల నుంచి విద్యుత్, సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేయవచ్చని సూచించారు. డంపింగ్ యార్డును పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని కోరారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు చుట్టుపక్కల నివసించే ప్రజల సమస్య నిన్నమొన్నటిది కాదు. సుమారు 12 ఏళ్లుగా స్థానికులు వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. డంపింగ్ యార్డు నిర్వహణలో నిబంధనలు పాటించాలనే అంశంపై న్యాయపరమైన పోరాటాలు కూడా జరిగాయని తెలిపారు. గతంలో ఎంపీగా పనిచేసిన రేవంత్‌రెడ్డి సైతం ఈ సమస్యపై ఎన్జీటీ, సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజల తరపున పోరాడిన నాయకుడు ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత సమస్య త్వరగా పరిష్కారమవుతుందని ఆశించానని, అయితే రెండేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ప్రజల తరపున మరోసారి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నట్లు స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి నిధులు, సాంకేతిక పరిజ్ఞానం రెండూ కీలకమని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. జవహర్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వచ్చినా వెనుకాడకూడదని సూచించారు. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల నిర్మాణంలో ఉపయోగించడం, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయడం, పొడి చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం వంటి మార్గాలను ప్రస్తావించారు. అయితే ఈ ప్రతిపాదనలు ఆచరణలోకి రావాలంటే వ్యర్థాల వర్గీకరణ, కాలుష్య నియంత్రణ, శాస్త్రీయ ప్రాసెసింగ్, నిర్వహణ ఖర్చులపై సమగ్ర ప్రణాళిక అవసరం. కేవలం చెత్తను తరలించడం కాకుండా, ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను సురక్షితంగా శుద్ధి చేయడం కూడా ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన తెలిపారు. మరోవైపు డంపింగ్ యార్డు ప్రభావంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, పర్యావరణ సమస్యలను ఈటల రాజేందర్ తీవ్రంగా ప్రస్తావించారు. చెరువులపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు ఉపాధి దెబ్బతింటోందని, పశువులు, గొర్రెలు, మేకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్థానికంగా క్యాన్సర్ మరణాలు, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎదులాబాద్‌లో సుశీల అనే మహిళ క్యాన్సర్‌తో మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ ప్రజల బాధలను ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ ఆరోగ్య సమస్యలకు డంపింగ్ యార్డు కాలుష్యమే ప్రత్యక్ష కారణమా అనే విషయాన్ని నిర్ధారించేందుకు వైద్య, పర్యావరణ నిపుణులతో సమగ్ర అధ్యయనం, నీరు, గాలి నాణ్యత పరీక్షలు అవసరం.




ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు బీజేపీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాదయాత్ర చేపట్టినట్లు ఈటల రాజేందర్ వెల్లడించారు. మంగళవారం ఎదులాబాద్ నుంచి ప్రారంభమైన యాత్రలో తొలిరోజు సభ నిర్వహించగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. చివరి రోజు బాలాజీనగర్‌లో భారీ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చూపిన పోరాట స్ఫూర్తితోనే ప్రజల సమస్య పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ పాదయాత్రతో ప్రభుత్వం స్పందిస్తుందా? డంపింగ్ యార్డు ప్రక్షాళనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధమవుతుందా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు కేటాయిస్తాయా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. జవహర్‌నగర్ ప్రజలకు కావాల్సింది హామీలు మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన జీవనం, కాలుష్యరహిత వాతావరణం, శాశ్వత పరిష్కారం.



## నాగారంలో ఎల్నినోపై అవగాహన సదస్సు

- నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక అవసరం
- సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్

చౌటుప్పల్,విశాలభారతి:

మండలం నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్ నినో ప్రభావంపై ప్రత్యేక అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రామ సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసి, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని తెలిపారు. దీని వల్ల తాగునీటి ఎద్దడి, పంట నష్టాలు, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు.

**ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:**

తాగునీటిని వృధా చేయకుండా, అవసరానికి తగ్గట్టుగా పొదుపుగా వాడాలి.ఇంటి ఆవరణంలో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు తవ్వుకోవాలి.బోరుబావులు, బావుల వద్ద నీటి వృధాను అరికట్టాలి.కుళాయిలు, పైపుల లీకేజీలను వెంటనే అరికట్టాలి.రైతులు నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీరు అవసరమయ్యే పంటలు వేసుకోవాలి.పశువులకు, మూగజీవాలకు తాగునీటి తొట్టెల్లో నీరు అందుబాటులో ఉంచాలి. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ తరపున అన్ని చర్యలు తీసుకుంటామని, మిషన్ భగీరథ నల్లాల ద్వారా ప్రతి ఇంటికి సక్రమంగా నీరు అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. వేసవిలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం నీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్‌ఏ, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఖాజాగూడ జంక్షన్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి

అధికారులకు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆదేశాలు

సైబరాబాద్ - విశాల భారతి

రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజాగూడ జంక్షన్‌లో జరుగుతున్న రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మాణ పనుల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖాజాగూడ జంక్షన్‌ను సందర్శించిన ఆయన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించి పైప్‌లైన్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల మార్పులు తదితర సాంకేతిక అంశాలపై పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. అలాగే రాయదుర్గం పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు మణికొండలోని జీహెచ్ఎంసీ కమిటీ హాల్‌ను సందర్శించి, ప్రజలకు, పోలీస్ సిబ్బందికి అనువైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ



నిర్మాణ పనుల సమయంలో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా, సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, మాదాపూర్ ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ భూపతి, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 'పారడైజ్'లో కేసీఆర్ పాత్రలో అదరగొట్టిన ప్రియదర్శికి ఘన సత్కారం

- చిర్ర రవీందర్ యాదవ్ ఆత్మీయ అభినందన

సైబరాబాద్ - విశాల భారతి

'పారడైజ్' చిత్రంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రలో తన నటనతో ఆకట్టుకున్న ప్రముఖ సినీ నటుడు ప్రియదర్శికి ఘన సత్కారం లభించింది.బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిర్ర రవీందర్ యాదవ్ తమ నివాసంలో ప్రియదర్శిని ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రతిమను బహూకరించి అభినందించారు.ఈ సందర్భంగా చిర్ర రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ మట్టి వాసనను, పల్లె జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'మల్లేశం', 'బలగం' వంటి చిత్రాల్లో ప్రియదర్శి కనబరిచిన నటనా ప్రతిభ అమోఘమన్నారు. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని వెండితెరపై ఆవిష్కరించే కళాకారులకు ఎల్లప్పుడూ ప్రత్యేక గౌరవం ఉంటుందని పేర్కొన్నారు.



## ఆనకట్ట వద్ద నీటి నిల్వలపై మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి

- ఇసుక బస్తాలతో ఆనకట్ట ఎత్తు పెంపునకు చర్యలు
- ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా పనులు
- నేడు దుమ్ముగూడెం ఆనకట్టను సందర్శించనున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(కొడారి వెంకటేశ్వర్లు)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, విశాల భారతి :

రానున్న ఎండాకాలంలో గోదావరి జలాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా, తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుమ్ముగూడెం ఆనకట్టపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గి, జలవనరులపై ఒత్తిడి పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో నేటి ఆదివారం ఆనకట్టను సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించనున్నారు.

**ఇసుక బస్తాలతో నీటి నిల్వకు చర్యలు :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం సమీపంలో గల గోదావరి నదిపై ఉన్న ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటి నిల్వ స్థాయిని కొంతమేర పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంత్రి తుమ్మల సూచనల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఆనకట్ట వద్ద ప్రస్తుత పరిస్థితులు, చేపట్టిన పనుల పురోగతి, నీటి నిల్వకు ఉన్న అవకాశాలను మంత్రి పరిశీలించనున్నారు. ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటి మట్టాన్ని పెంచే చర్యలు చేపట్టేటప్పుడు ఆనకట్ట భద్రత, నీటి ప్రవాహం, దిగువ ప్రాంతాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం పై ఉన్న ఆవశ్యకత ఆధారంగా నీటిని నిలువ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వ పెంపుతో పాటు అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించుకునేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉండడంతో మంత్రి మరోసారి ఆనకట్టకు వద్దకు వస్తున్నట్లు తెలుస్తోంది.





**తాగునీటి అవసరాలకు గోదావరి జలాలే కీలకం :**

వేసవిలో పినపాక నియోజకవర్గంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇతర ప్రాంతాలకు తాగునీటి అవసరాల కోసం సరఫరా చేసే రా వాటర్ అయినా గోదావరి జలాలు అత్యంత కీలకం కావడంతో దుమ్ముగూడెం ఆనకట్టపై ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించింది. ఎండలు తీవ్రతరం అయిన సమయంలో నదిలో నీటి మట్టం తగ్గితే తాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి నీటి నిల్వను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగించడం అత్యంత ప్రాధాన్యమైంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు.

**పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం :**

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎందుకు అవసరమైన ఏర్పాట్లు నా అధికారులు చేశారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు సరిపడా గోదావరి జలాలు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే మంత్రి పర్యటన నేపథ్యంలో స్థానిక అధికారులు అవసరమైన ఏర్పాట్లను శనివారమే చేశారు. రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే జలవనరుల నిర్వహణపై దృష్టి సారించడం ద్వారా పినపాక నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీర్చేందుకు దోహదపడుతుందని భద్రాద్రి జిల్లా ప్రజలతోపాటు పినపాక నియోజకవర్గం లోని ప్రజలు ఆశిస్తున్నారు. పొంచి ఉన్న ఎల్ ని నో ముప్పుతో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదనే ప్రభుత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టిన తీరుపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ప్రకటనల పాలసీ ఫ్లాప్

- బడా ఏజెన్సీలతో కుమ్మక్కు.. ప్రజాధనం లూటీ
- పాలసీ అమలుకు కాంగ్రెస్ పెద్దల మోకాలడ్డు
- చక్రం తిప్పుతున్న ముఖ్యనేత అనుచరులు, యువ ఎమ్మెల్సీ
- యథేచ్ఛగా అనుమతి లేని ప్రకటనల బోర్డులు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు కేంద్రంగా రెచ్చిపోతున్న ఏజెన్సీలు
- జీవో పట్టించుకోని ఏఆర్సీ కమిటీ

సిటీబ్యూరో, విశాల భారతి :

నగరంలో ఎకడ ప్రకటనలు ఉండాలి? వేటికి అనుమతులు ఇవ్వాలి? అనే అంశాలను ఈ కమిటీయే తేలుస్తుంది. ఈ అధికారిక ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కావడం..క్షేత్రస్థాయిలో వందల సంఖ్యలో అక్రమ హోర్డింగ్‌లు, లాలీపాప్స్ బోర్డులు, భారీ కాంటిలివర్లు అనధికారికంగా ఉండడం...రోజుకో కొత్త




ఏరియాలో అక్రమ ప్రకటనల బోర్డులు వెలుస్తుండడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. ముఖ్యంగా ముఖ్యనేత అనుచరులు, ఓ యువ ఎమ్మెల్సీ ఈ ప్రకటనల బోర్డుల వెనుక అన్నీ తానై నడిపిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉంటున్న ఓ అధికారిణి సైతం చక్రం తిప్పుతూ అందినంత దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రకటన విభాగంలో అధికారుల నిర్లక్ష్యం, అవినీతి అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతుంది. విలీన మున్సిపాలిటీల్లో ఎన్ని ప్రకటనల బోర్డులు అనధికారికంగా ఉన్నాయో? ఎన్ని అనుమతులున్నాయో, వాటికి ఎంత గడువుందో తెలియదు. అక్రమంగా ఏర్పాటైన ప్రకటనల బోర్డుల ద్వారా జీహెచ్ఎంసీ ఖజానాకు జరుగుతున్న నష్టానికి లెక్కేలేదు, యూనిపోల్స్, లాలీపాప్స్, హోర్డింగు ఇలా అనేక ఉన్న ప్రాంతాలు అధికారుల రికార్డులు లెక్కలకు , క్షేత్రస్థాయిలో ఉన్న వాటికి ఎక్కడ పొంతన ఉండడం లేదన్నది ఇటీవల వస్తున్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా వట్టి నాగులపల్లి ముప్పా రోడ్డు, గోపన్‌పల్లి తండా ప్రాంతాల్లో గడిచిన కొన్ని రోజులుగా అక్రమ ప్రకటన నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. జీహెచ్ఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, ఎటువంటి పర్మిషన్లు లేకుండానే వందలాది లాలీపాప్‌లు, భారీ కాంటిలివర్లు వెలుస్తున్నాయి. వట్టి నాగులపల్లి నుంచి ముప్పా రోడ్డు వరకు, గోపన్‌పల్లి ఫ్లైఓవర్ సమీపంలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 10 నుంచి 15 వరకు ఫౌండేషన్లు, నాలుగు చోట్ల ప్యానెల్ నిర్మాణాలు, సుమారు 400 నుంచి 500 వరకు కొత్త లాలీపాప్‌లు, 20 నుంచి 30 వరకు కాంటిలివర్లు అనధికారికంగా ఉండడం గమనార్హం.

## తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వార్డు సభ్యుడు నేలపట్ల కోటి రామిరెడ్డి

అశ్వాపురం, విశాల భారతి :

ఆర్నబ్ తుఫాను దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అమ్మగారిపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు నేలపట్ల కోటి రామిరెడ్డి సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అనవసరంగా దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన కారణంగా గ్రామ పంచాయతీ, మండల పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకూడదని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లద్దన్నారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విపత్తు కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురైతే సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపడతారన్నారు.



## మన్సూరాబాద్‌లో వైభవంగా దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలు

- **అమ్మవారి పవిత్ర వస్తువుల వేలం రూ.4.60 లక్షలు**
- **వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మన్సూరాబాద్‌లోని వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గాభవాని మాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంగా ముగిశాయి. కాలనీలోని సంక్షేమ భవనం ప్రాంగణంలో పది రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు, కలశం తదితర పవిత్ర వస్తువుల వేలంపాటను ఘనంగా నిర్వహించారు. ఈ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం రూ.4,60,900 విలువైన వేలంపాట నిర్వహించడం విశేషం. అమ్మవారిపై భక్తులకు ఉన్న విశ్వాసం, భక్తిభావం ఈ కార్యక్రమంలో ప్రతిబింబించాయి. పది రోజులపాటు నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కాలనీవాసులు, మహిళలు, యువత, దాతలు విశేష సహకారం అందించారు. భక్తుల భాగస్వామ్యం, స్థానికుల ఐక్యతతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన భక్తులకు, దాతలకు, కాలనీవాసులకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ దుర్గాభవాని మాత ఆశీస్సులతో మన్సూరాబాద్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## నాగోల్‌లో చిరుతపులి ఫేక్ ఫొటో కలకలం

- **ప్రజల్లో భయాందోళనలు.. నిందితుడిపై కేసు**







**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి సంచరిస్తోందంటూ నకిలీ ఫొటోను సృష్టించి ప్రచారం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వివరాలు వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో నాగోల్‌లోని ఆనంద్‌నగర్, ఫతుల్లాగూడ ప్రాంతాల్లో భాష్యం స్కూల్ సమీపంలో చిరుతపులి సంచరిస్తోందంటూ ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఈ నెల 26న ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం. అనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.విచారణలో సచిన్ అనే వ్యక్తి ChatGPT ద్వారా చిరుతపులి ఫొటోను కృత్రిమంగా రూపొందించి తన యజమానికి పంపించినట్లు గుర్తించారు. అనంతరం ఆ ఫొటోను యజమాని నాగోల్ ఎస్‌హెచ్‌ఓకు పంపించినట్లు విచారణలో వెల్లడైంది. సదరు వ్యక్తిని మద్యం మత్తులో ఉన్న సమయంలో నాగోల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం సంబంధిత ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా, చిరుతపులి సంచరించినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదు.నకిలీ ఫొటో ప్రచారం వల్ల ప్రజల్లో అనవసర భయాందోళనలు కలిగే అవకాశం ఉండటంతో పాటు, అటవీ శాఖ, పోలీసు సిబ్బంది విలువైన సమయాన్ని వెచ్చించాల్సి వచ్చిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా సచిన్ (21), తండ్రి ఉమేష్, ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అతను కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీకి చెందినవాడని, ప్రస్తుతం ఫతుల్లాగూడలో నివసిస్తున్నట్లు వివరించారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫొటోలు, వార్తలను నిర్ధారించుకోకుండా ప్రచారం చేయవద్దని పోలీసులు సూచించారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలించాలి

- **ఈటల రాజేందర్ నేతృత్వంలో పాదయాత్ర**
- **పాదయాత్రలో పాల్గొన్న ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి పలువురు నాయకులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ నేతృత్వంలో చేపట్టిన పాదయాత్రలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి సైతం ఈ పాదయాత్రలో పాల్గొని డంపింగ్ యార్డు తరలింపు డిమాండ్‌కు మద్దతు తెలిపారు. డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ యార్డును తరలించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ పాదయాత్రలో పాల్గొని స్థానిక ప్రజలకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ పాదయాత్రలో మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, పవన్ కుమార్, చింతల అరుణ, సురేందర్ యాదవ్, బద్దం ప్రేమ్, మహేష్ రెడ్డితో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాటేదాన్‌లో కెమికల్ పేలుడు.. ఇద్దరికి గాయాలు



**రాజేంద్రనగర్, విశాల భారతి:** కాటేదాన్ ప్రాంతంలోని బాటిళ్ల తయారీ పరిశ్రమలో కెమికల్ పేలుడు ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో సాయి అనే వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా, అతని కాలిపాదం సగం మేరకు తెగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ప్రస్తుతం ఇద్దరూ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాటిళ్ల తయారీ పరిశ్రమలో కెమికల్ పేలుడు జరగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం ఎలా సంభవించింది, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## గ్రామాల్లో జోరుగా కొనసాగుతున్న పేకాట



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని అమ్రాద్. మాక్లూర్. ముల్లంగి. కృష్ణానగర్ మదనపల్లి. ఒడ్యాట్ పల్లి.మహాలక్ష్మినగర్ కాలనీ. ఆర్టిసి కాలనీ మామిడిపల్లి గుత్ప కల్లడి రామచంద్ర పల్లి చిన్నపూర్ కొత్తపల్లి. గొట్టుముక్కల. ఈ గ్రామ శివారులో అటవీ ప్రాంతాలలో మరియు స్మశాన వాటికల్లో. కొన్ని రోడ్డుకి ఇరువైపులా ఉన్న షాపులలో అడ్డు వేసుకొని పెద్ద మొత్తంలో పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు చిక్కకుండా నిఘాలు ఏర్పాటు చేసుకుంటూ జోరుగా పేకాట ఆడుతున్న వారిపై పోలీసుల నిఘా లేకపోవడంతో గ్రామాలలో ప్రజలు పోలీసులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోని పేకాట రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని అటు రైతులు ఇటు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇతర గ్రామాల నుండి వచ్చి పేకాట ఆడుతున్నట్లు ప్రజలు తెలియజేశారు.

# ఇబ్రహీంపట్నం నుంచే ఉద్యమకారులకు ఇళ్ల పట్టాలు!

- **జీవో వచ్చిన 24 గంటల్లో స్థలాలు చూపిస్తా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి హామీ**
- **ఈ దఫా ఇళ్ల పట్టాలు.. మళ్లీ గెలిచాక గృహాలు | వచ్చే ఎన్నికల్లో 80 వేల మెజార్టీతో గెలుస్తా**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. హైలెవెల్ కమిటీ నిర్ణయం మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసిన 24 గంటల్లోనే అర్హులైన ఉద్యమకారులకు వారు కోరుకున్న చోట ఇంటి స్థలాలు చూపించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మంగళవారం తొర్రూర్‌లో రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఒక్కరితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడలేదని, ఎంతోమంది ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుతో సోనియాగాంధీ ఆశించిన లక్ష్యాలు గత పదేళ్లలో నెరవేరలేదని, ఒక కుటుంబం మాత్రమే ప్రయోజనం పొందిందని విమర్శించారు. కబ్జాలు, లంచాలతో కొందరు దోచుకున్నారని ఆరోపించారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు గత పదేళ్లలో తగిన గుర్తింపు లభించలేదని పేర్కొన్న ఎమ్మెల్యే, వారందరికీ ఇంటి స్థలాలు కేటాయించేందుకు హైలెవెల్ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి జీవో వెలువడిన 24 గంటల్లోనే అర్హులకు స్థలాలు చూపించే బాధ్యత తీసుకుంటానని పునరుద్ఘాటించారు. ఈ దఫా ఉద్యమకారులకు ఇళ్ల పట్టాలు అందిస్తామని, రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిచిన అనంతరం వారికి గృహాలు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి, వచ్చే ఎన్నికల్లో 80 వేల మెజార్టీతో విజయం సాధిస్తానని ప్రకటించారు. అంతటి మెజార్టీ సాధించకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు.

## ఫ్లిప్‌కార్ట్ సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రహదారి ప్రమాదాల నివారణ, వాహనదారులు, పాదచారుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఫ్లిప్‌కార్ట్ రిటైల్ మార్ట్ సిబ్బంది, విక్రయ విభాగం అధికారులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 90 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాదచారులు రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని, రహదారి కూడళ్ల వద్ద ఇరువైపులా వాహనాల రాకపోకలను గమనించి సురక్షితంగా రోడ్డు దాటాలని వివరించారు. పగలు, రాత్రి వేళల్లో రహదారిపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మోటారు వాహనాల నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు అప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణాల రక్షణతో పాటు ఇతరుల భద్రతను కూడా బాధ్యతగా భావించాలని పోలీసులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డెల్టా25 బృందం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉద్యోగులు, వాహనదారుల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంపొందించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!






- **నవభారత్‌లో తెల్లవారుజామున ఘోర ప్రమాదం**
- **సింగరేణి ఉద్యోగి సతీష్‌రెడ్డి మృతి**

**పాల్వంచ విశాల భారతి:** ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. బస్సు లగేజ్ డోర్ తెరిచి ఉండటంతో రోడ్డు పక్కన బైక్‌పై కూర్చున్న సింగరేణి ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన పాల్వంచలోని నవభారత్ సెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకు చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నవభారత్‌కు చెందిన సతీష్‌రెడ్డి (40) సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మంగళవారం ఉదయం టీ తాగేందుకు నవభారత్ సెంటర్‌కు వచ్చిన ఆయన, రోడ్డు పక్కన బైక్ పార్క్ చేసి టీ తాగాడు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై కూర్చుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న బీఎస్ఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి కారణమైంది.బస్సు లగేజ్ డోర్ తెరిచి ఉండగా, దాన్ని గమనించకుండా డ్రైవర్ బస్సును వేగంగా నడిపినట్లు సమాచారం. ఈ క్రమంలో తెరిచి ఉన్న లగేజ్ డోర్ సతీష్‌రెడ్డి తలకు బలంగా తగలడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లముందే జరిగిన ఈ ఘటనతో స్థానికులు దిగ్భ్రాంతికిగురయ్యారు.సమాచారం అందుకున్న పాల్వంచ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు లగేజ్ డోర్ తెరిచి ఉండటానికి గల కారణాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబానికి అండగా నిలవాల్సిన సతీష్‌రెడ్డి అకాల మరణంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది.

## కోర్టు నూతన భవనం, రోడ్డు సౌకర్యం కల్పనపై దృష్టి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** దశాబ్దాల క్రితం నిర్మించిన ఇబ్రహీంపట్నం కోర్టు భవనం స్థానంలో నూతన కట్టడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నంలో బార్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు లేవనెత్తిన పలుసమస్యలు, ఇతర అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం కోర్టు నూతన భవనం అంశం ఇప్పటికే పరిశీలనలో ఉందని, కొత్త భవనంతోపాటు కోర్టు వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక దృష్టి సారిస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. న్యాయవాదుల రక్షణ కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన అడ్వకేట్ల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. న్యాయవాదులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అడ్వకేట్ల పాత్ర మరువలేనిదన్నారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సామ రామ్మోహన్‌రెడ్డిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా నిలబెట్టామని మల్‌రెడ్డి చెప్పారు. పట్టభద్రులందరూ ఓటు నమోదుచేసుకుని, రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయవాదుల సమస్యల పరిష్కారం సాధ్యమన్న ఎమ్మెల్యే... ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్న మల్‌రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం అభివృద్ధిలో న్యాయవాదులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ పీపీ వేణుగోపాల్ రెడ్డి, న్యాయవాదులు రాములు, వెంకట్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

- **పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** రాబోయే హైదరాబాద్-మహబూబ్ నగర్ రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ స్వామి గౌడ్, క్యామ మల్లేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవాలని, పార్టీ విధానాలు, గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతం చేయాలని అన్నారు. పార్టీ శ్రేణుల ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, దండెం రామ్ రెడ్డి, కర్నాటి రమేష్‌గౌడ్ ఇబ్రహీంపట్నం కౌన్సిలర్లు, సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి

- **బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల గ్రాడ్యుయేట్ ఓటర్ల ముఖ్య నాయకుల సమావేశం యాచారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ కు ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ కారింగు యాదయ్య, సీనియర్ నాయకులు లిక్కి నర్సింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు సీనియర్ నాయకులు యువ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 202627 కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమని పేర్కొంటూ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని, వారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నందున, క్రీడాకారుల వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, నవ్య భారతి స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, లత, స్థానిక అధికారులు, రూరల్ సిఐ శ్రీనివాస్ మండల ఎస్సై అనిల్ రెడ్డి. మాక్లూర్ మండల ఎమ్మార్వో శేఖర్. విద్యుత్ శాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కురవి పశువుల సంతలో అక్రమ వసూళ్ల కలకలం!

- రైతుల రక్తాన్ని పీలుస్తున్నారా?
- పశువుకు రూ.150.. మేక, గొర్రెకు రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు.
- పాత రసీదు పుస్తకాల వినియోగంపై అనుమానాలు.. టెండర్ నిబంధనలు గాలికేనా?
- జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలేవీ? పర్యవేక్షణపై ప్రశ్నలు.
- గుత్తేదారు వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి.. ప్రజల డిమాండ్

**కురవి, విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**




రైతు కష్టానికి విలువ లేదా? సంతలో అడుగుపెడితే అదనపు వసూళ్ల భారం తప్పదా? ప్రజాధనంతో నడవాల్సిన వ్యవస్థలో రైతుల జేబులకు చిల్లులు పడుతున్నా పట్టించుకునేవారు లేరా? మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు పశువుల సంతలో వసూళ్ల వ్యవహారం ఇప్పుడు తీవ్ర వివాదానికి కేంద్రంగా మారింది. పశువులను అమ్ముకునేందుకు వచ్చే రైతుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా, వాటిపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నాయి.

**వసూళ్లకు హద్దులేవీ?**

కష్టపడి పశువులను పెంచి, వాటిని విక్రయించేందుకు సంతకు తీసుకొచ్చే రైతుల నుంచి ఒక్కో పశువుకు రూ.150, ఒక్కో మేక లేదా గొర్రెకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుత్తేదారు నియమించిన ఏజెంట్లు ఈ మొత్తాలను వసూలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే ఇవి అధికారికంగా అనుమతించిన రుసుములేనా? టెండర్ నిబంధనల్లో ఇంత మొత్తం వసూలు చేయడానికి అవకాశం ఉందా? నిర్ణీత రుసుములకు మించి వసూలు చేస్తుంటే అడ్డుకునే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంత నిర్వహణ పేరుతో రైతులపై ఇష్టారాజ్యంగా ఆర్థిక భారం మోపడానికి ఎవరికీ అధికారం లేదు. వసూళ్లకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు ఉండాలి. వాటిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పకూడదు. కానీ కురవి సంతలో వాస్తవంగా ఎంత వసూలు చేస్తున్నారు? ఆ డబ్బులు ఏ లెక్కల్లోకి వెళ్తున్నాయి? అన్న అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**పాత రసీదుల వెనుక అసలు కథేంటి?**

సంతలో వసూళ్లకు పాత రసీదు పుస్తకాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వ్యవహారాన్ని మరింత అనుమానాస్పదంగా మారుస్తున్నాయి. ప్రస్తుత టెండర్‌కు సంబంధించిన రసీదులే ఉపయోగిస్తున్నారా? పాత పుస్తకాల వినియోగానికి అధికారిక అనుమతి ఉందా? వసూలు చేసిన ప్రతి రూపాయికి లెక్కలు చూపుతున్నారా? అన్న అంశాలపై స్పష్టత లేదు. అధికారులు కేవలం కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు తెప్పించుకోవడం కాకుండా, సంతలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. రసీదు పుస్తకాలు, వసూళ్ల రిజిస్టర్లు, టెండర్ ఒప్పంద పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. ఆరోపణల్లో నిజం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని తేలితే ఆ విషయాన్ని కూడా ప్రజలకు వెల్లడించాలి.

**ఫిర్యాదులు పట్టించుకోరా?**

ఈ వ్యవహారంపై టెండర్ ప్రారంభ దశలోనే జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, మండల పంచాయతీ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదులు చేసినట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందిన తర్వాత విచారణ చేపట్టారా? గుత్తేదారుకు నోటీసులు ఇచ్చారా? వసూళ్లపై తనిఖీలు చేశారా? అనే వివరాలు వెల్లడించాల్సి ఉంది. ప్రజలు ఫిర్యాదు చేస్తే స్పందించడం అధికారుల విధి. రైతుల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయడం సరైన పద్ధతి కాదు. ఫిర్యాదులు అందినా చర్యలు కనిపించకపోవడంతో అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**టెండర్ గుత్తేదారుదే..**

**నిబంధనలు కూడా వర్తించవా?**

పశువుల సంత నిర్వహణకు టెండర్ పొందినంత మాత్రాన గుత్తేదారుకు ఇష్టానుసారంగా రుసుములు వసూలు చేసే హక్కు లభించదు. ఒప్పందంలో పేర్కొన్న షరతులు, అధికారికంగా అనుమతించిన రుసుముల పరిధిలోనే వసూళ్లు జరగాలి. ఈ విషయంలో గ్రామపంచాయతీ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. టెండర్ ద్వారా ఎంత ఆదాయం సమకూరుతోంది? రైతుల నుంచి ఎంత వసూలు చేస్తున్నారు? రికార్డుల్లో ఎంత చూపిస్తున్నారు? అనే అంశాలను సరిపోల్చి పరిశీలించాలి. వసూళ్లకు సంబంధించిన నిబంధనలను బహిరంగంగా ప్రదర్శిస్తే రైతులకు స్పష్టత ఉంటుంది. ప్రతి చెల్లింపునకు రసీదు అందించడం తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలి. ఈ కనీస చర్యలు లేకపోతే అనుమానాలకు మరింత అవకాశం ఏర్పడుతుంది.

**ఉన్నతాధికారులు మేల్కొనాలి!**

కురవి పశువుల సంతలో వసూళ్ల వ్యవహారాన్ని చిన్న సమస్యగా తీసిపారేయడానికి వీల్లేదు. రైతుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశం కావడంతో జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలి. జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించి, టెండర్ నిబంధనల ఉల్లంఘన జరిగిందా లేదా అన్నది నిర్ధారించాలి. అక్రమ వసూళ్లు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదనంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇప్పించే అంశాన్ని కూడా నిబంధనల మేరకు పరిశీలించాలి. రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో వేగం చూపుతున్నవారు.. ఫిర్యాదులపై విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సంతలో వసూళ్లకు సంబంధించి పూర్తి వివరాలను బహిర్గతం చేయాలి. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా? అక్రమ వసూళ్ల ఆరోపణలకు అడ్డుకట్ట వేస్తారా? లేక ఫిర్యాదులు కాగితాలకే పరిమితం అవుతాయా? కురవి రైతులు, పశుపోషకులు సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారెవరైనా చర్యలు తప్పకూడదని, సంత నిర్వహణ పారదర్శకంగా సాగాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# పంద మారని ఇసుక దందా



- గోదారి ఇసుక గోల్మాల్
- అక్రమ ఇసుకకు అడ్డుకట్ట లేదా
- సామాన్యుడికి పెను మారిన ఇసుక
- అక్రమ కట్టడాలకు అక్రమ ఇసుక అందుబాటులో
- గోదావరి గోస పట్టనీ అధికారులు

**భద్రాచలం :విశాల భారతి:**

భద్రాచలం పట్టణంలోని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కోదారమ్మ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వైనం భద్రాచలంలో చోటు చేసుకుంటుంది. చుట్టూ అధికారులు ఉన్న చూసేవారు కరువై పోయారు. ఇదే అదునుగా భావించిన అక్రమ ఇసుక ముఠా రోజు రోజుకి వ్యూహాత్మకంగా కొనసాగుతోంది. అదురు బెదురు లేకుండా అర్ధరాత్రి ట్రాక్టర్లతో ఇసుకను వారు ఒప్పందం చేసుకున్న బహుళ అంతస్తుల వద్ద తెల్లవారిసరికి ఇసుక దర్శనమిస్తుంది .ఎక్కడిది ఇసుకని అడిగే వారు కరువయ్యారు. ముడుపుల మాయ అనేది ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. భద్రాచలంలో ఇష్టానుసారంగా గోదారమ్మ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వైనం పెద్ద ఎత్తున కనిపిస్తుంది. దీనిని ప్రశ్నించే వారి లేకపోవడం ఇంకా సామాన్య ప్రజలకు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోతుంది. భద్రాచలం లో ఏం జరుగుతుందో తెలవక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు అక్రమంగా తరలిస్తున్న ఇసుక సామాన్యుడు ఇల్లు కట్టుకునేందుకు 5000 అవుతుంది. ఇసుకను కొనే పరిస్థితి లేక లబోదిబోమని మొత్తుకుంటున్నారు. ఒకపక్క బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలకు ఇదేచ్ఛగా ఇసుకను అర్ధరాత్రి పూట తోలటం వెనుక రహస్యాన్ని అధికారులు చెప్పాలి. విలేకరులు ప్రశ్నిస్తే వారిపై దురుసుగా ప్రవర్తించడం అనేది ఇసుక ముఠాకు పరిపాటిగా మారింది. గోదావరి ఇసుకను ఎవరు కాపాడాలి అనేది అధికారులు తేల్చాలి. తూతూ మంత్రంగా కట్టడి చేసినట్లు చేయటం కాకుండా సమూలంగా ఈ సమస్యను పరిష్కరించాలి ప్రజలకు అందుబాటులో ఇసుకను తీసుకురావాలి. వెయ్యి రూపాయలకే ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. భద్రాచలం పట్టణంలో మట్టిని ఇసుకను అక్రమంగా తోలి నిలువలు చేసుకుని భారీగా అమ్ముకుంటున్న వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆస్తిని గోదారమ్మ ఇసుకను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది



**మొదటి పేజీ తరువాయి**

ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పుడు వాటిని ఎత్తిపోసి పొలాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటార్లు నడిపి ఉంటే సాగునీటి అవసరాలను కొంతవరకైనా తీర్చే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను నడపకపోవడానికి సాంకేతిక, నీటిమట్టం సంబంధిత కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి లభ్యత ఎంత ఉంది, పంపింగ్‌కు అవసరమైన పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా, అందుబాటులో ఉన్న నీటిని ఎంతవరకు వినియోగించుకోవచ్చనే అంశాలపై స్పష్టత అవసరమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ సాగుతున్న రాజకీయ పోరాటం కూడా ఈ వివాదంలో ప్రధానాంశంగా మారింది. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టును ఉపయోగిస్తే ఆయనకు రాజకీయంగా పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పంపులను నడపడం లేదని కేటీఆర్ ఆరోపించారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని చెబుతూ, రాష్ట్రానికి ఉపయోగపడాల్సిన నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నీటిని సమర్థంగా వినియోగిస్తే విస్తృతంగా సాగునీరు అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అయితే, నదుల్లో నీటి ప్రవాహం ఉండటం మాత్రమే సాగునీటి సరఫరాకు సరిపోదు. ప్రాజెక్టుల సామర్థ్యం, నీటి నిల్వలు, పంపుల పనితీరు, కాలువల వ్యవస్థ, విద్యుత్ సరఫరా వంటి అంశాలు కూడా కీలకంగా ఉంటాయి. అందువల్ల రాజకీయ ఆరోపణలకు అతీతంగా ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులు, నీటి వినియోగంపై అధికారిక గణాంకాలు ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. రైతుల కష్టాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మరిన్ని విమర్శలు చేశారు. రైతుబంధు సాయం, సకాలంలో విద్యుత్, యూరియా, సాగునీరు వంటి అంశాల్లో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పంటలు ఎండిపోతుండటంతో కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని, పశువులను సైతం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులపై ముందస్తు అంచనాలు ఉన్నప్పుడు నీటిని నిల్వ చేసుకునేందుకు, సాగునీటి నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లిస్తున్నారని, తెలంగాణలో మాత్రం నదుల నీరు వృథా అవుతోందని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద నీటిమట్టం తక్కువగా ఉండటంతో పంపుల నిర్వహణ సాధ్యం కావడం లేదన్నది వారి వాదన. ఈ భిన్న వాదనల మధ్య అసలు పరిస్థితిని నిర్ధారించేది ప్రాజెక్టుల వారీగా నీటి లభ్యత, వినియోగం, సాగునీటి సరఫరా వివరాలే. ఇక ఈ వివాదం కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికల రాజకీయాలకు కూడా ముడిపడుతోంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలవడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. రైతుల పంటలను కాపాడటం ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత కావాలని సూచించారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్యానిస్తూ, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే, రైతులకు సాగునీరు అందించడంలో ఎవరి వాదన సరైనదనే దానికంటే, క్షేత్రస్థాయిలో పంటలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నదే ఇప్పుడు ముఖ్యం. నీటి లభ్యతపై పారదర్శక సమాచారం, ప్రాజెక్టుల నిర్వహణపై స్పష్టమైన నిర్ణయాలు, అవసరమైన ప్రాంతాలకు సకాలంలో సాగునీటి సరఫరా రైతులకు ఊరటనివ్వగలవు. రాజకీయ విమర్శలు ఎన్ని సాగినా, ఎండిపోతున్న పంటలకు నీరు అందించడం, అన్నదాతకు నష్టం తగ్గించడం ప్రభుత్వానికి అసలైన పరీక్షగా నిలవనుంది.

# రిజ్వీ బాటలో మరో ఐఏఎస్ అధికారి?

- జయేష్ రంజన్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసినట్లు ప్రచారం
- అమెరికా సంస్థలో ఉన్నత ఉద్యోగం వచ్చినట్లు సమాచారం
- 2027 సెప్టెంబరులో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది
- తెలంగాణ ఐటీ, పరిశ్రమల రంగాల్లో కీలకంగా పనిచేశారు
- గతంలో ఐఏఎస్ రిజ్వీ కూడా వీఆర్ఎస్ తీసుకుని ప్రైవేటు రంగంలోకి
- జయేష్ రంజన్ వీఆర్ఎస్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రభుత్వంలో మరో కీలక ఐఏఎస్ అధికారి వీఆర్ఎస్ బాట పట్టనున్నారన్న ప్రచారం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల రంగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన జయేష్ రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ సర్వీసులో మరికొంత కాలం కొనసాగాల్సి ఉన్నప్పటికీ, ముందుగానే బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. అమెరికాకు చెందిన ఓ ప్రముఖ సంస్థలో ఉన్నతస్థాయి పదవి చేపట్టే అవకాశం రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే, ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారా? దాని వెనుక అసలు కారణాలేంటి? ప్రైవేటు రంగంలోకి వెళ్లడం ఖరారైందా? అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఈ పరిణామం నిజమైతే తెలంగాణ పరిపాలనా వర్గాల్లో మరో కీలక మార్పుగా నిలిచే అవకాశం ఉంది. జయేష్ రంజన్ పేరు తెలంగాణ ఐటీ, పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి రంగాలతో విడదీయలేని విధంగా ముడిపడి ఉంది. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన, రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఐటీ కంపెనీలతో సమన్వయం, ఎలక్ట్రానిక్స్ రంగ విస్తరణ, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖలతో పాటు సమాచార, పౌర సంబంధాల శాఖకు సంబంధించిన బాధ్యతలు కూడా చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు అదనపు బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా కీలక అధికారిగా కొనసాగడం ఆయన పరిపాలనా ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. ఇలాంటి నేపథ్యంలో ఆయన సర్వీసు నుంచి వైదొలగనున్నారన్న వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాధారణంగా ఐఏఎస్ అధికారులు పదవీ విరమణ వయసు వరకు ప్రభుత్వ సేవల్లో కొనసాగుతారు. అయితే, కొందరు వ్యక్తిగత నిర్ణయాలు, కొత్త అవకాశాలు, వృత్తిపరమైన మార్పుల కారణంగా ముందుగానే స్వచ్ఛంద పదవీ విరమణ కోరుతుంటారు. జయేష్ రంజన్ విషయంలోనూ ఇలాంటి పరిస్థితి ఉందన్న ప్రచారం సాగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఆయన 2027 సెప్టెంబరులో పదవీ విరమణ చేయాల్సి ఉండగా, అంతకంటే ముందే సర్వీసు నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన దరఖాస్తును కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖకు పంపినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే, దరఖాస్తు సమర్పించడం ఒక దశ మాత్రమే. సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ అనుమతులు, అధికారిక నిర్ణయం వంటి అంశాల ఆధారంగానే వీఆర్ఎస్ ప్రక్రియ పూర్తవుతుంది. కాబట్టి ఈ వ్యవహారంలో తుది నిర్ణయం వెలువడే వరకు ఆయన పదవీ విరమణపై స్పష్టమైన నిర్ధారణకు రావడం సరికాదు. ఇదే సమయంలో గతంలో సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ తీసుకున్న నిర్ణయం మరోసారి చర్చకు వస్తోంది. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన రిజ్వీ వీఆర్ఎస్ 2025 అక్టోబరు 31 నుంచి అమల్లోకి వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. అనంతరం ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్స్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ సేవల నుంచి ప్రైవేటు రంగంలోని ఉన్నతస్థాయి బాధ్యతల్లోకి మారడం అప్పట్లో రాజకీయంగా కూడా చర్చకు దారితీసింది. అప్పటి ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రిజ్వీకి ఏఐజీ హాస్పిటల్స్ నుంచి నెలకు రూ.10 లక్షల వేతనంతో ఉద్యోగ అవకాశం వచ్చిందని పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు జయేష్ రంజన్ విషయంలోనూ ప్రైవేటు సంస్థలో ఉన్నతస్థాయి ఉద్యోగం గురించి ప్రచారం జరగడంతో ఈ రెండు పరిణామాలను పోల్చి చూస్తున్నారు. అయితే, ఇద్దరి నిర్ణయాలకు సంబంధించిన పరిస్థితులు, కారణాలు వేర్వేరుగా ఉండవచ్చన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మొత్తంగా చూస్తే, జయేష్ రంజన్ వీఆర్ఎస్ వ్యవహారం కేవలం ఒక అధికారి పదవీ విరమణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ప్రభుత్వంలో కీలక అనుభవం సంపాదించిన అధికారులు ప్రైవేటు రంగంలోని అవకాశాలను ఎలా పరిశీలిస్తున్నారు? ప్రభుత్వానికి, అంతర్జాతీయ సంస్థలకు మధ్య అనుసంధానంగా పనిచేసిన వారి అనుభవం కొత్త రంగాల్లో ఎలాంటి పాత్ర పోషించగలదు? అనే ప్రశ్నలను కూడా ఈ పరిణామం ముందుకు తెస్తోంది. మరోవైపు, ఐటీ, పరిశ్రమల రంగాల్లో దీర్ఘకాల అనుభవం ఉన్న అధికారి వైదొలిగితే సంబంధిత శాఖల్లో బాధ్యతల మార్పులు ఎలా ఉంటాయన్న ఆసక్తి కూడా నెలకొంది. అయితే, అమెరికా సంస్థలో ఉద్యోగ అవకాశం లభించిందన్న ప్రచారం నుంచి వీఆర్ఎస్ ఆమోదం వరకు ఇంకా అధికారికంగా నిర్ధారించాల్సిన అంశాలు ఉన్నాయి. జయేష్ రంజన్ దరఖాస్తుపై ప్రభుత్వం, కేంద్ర సిబ్బంది శాఖ తీసుకునే నిర్ణయం, ఆయన భవిష్యత్ ప్రణాళికలపై వచ్చే స్పష్టతే ఈ వ్యవహారానికి ముగింపు పలకనున్నాయి. అప్పటివరకు ఇది అధికార వర్గాల్లో కొనసాగుతున్న చర్చగానే చూడాలి.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

- 7న నిరుద్యోగుల శాంతియుత మహార్యాలీని జయప్రదం చేయాలి
- నిరుద్యోగ జేఏసీ నాయకులు
- దిల్‌సుఖ్‌నగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

**ఎల్బీనగర్**



ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తామని రాష్ట్ర బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ భూక్యకుమార్ హెచ్చరించారు. నవంబర్ 7వ తేదీన నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ నుంచి ఇందిరాపార్కు వరకు నిర్వహించనున్న నిరుద్యోగుల శాంతియుత మహార్యాలీ పోస్టర్‌ను దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూక్యకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం ఒకే ఒక్క నోటిఫికేషన్ పోలీస్ విభాగంలో విడుదల చేసిందన్నారు. ఆ నోటిఫికేషన్ కూడా కేవలం 7 వేల ఉద్యోగాలకు ఇచ్చి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి నోటిఫికేషన్‌లో పోస్టులు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్, గురుకుల నోటిఫికేషన్, గురుకుల నోటిఫికేషన్, మోడల్ స్కూల్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీపీఓ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, గ్రూపు నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేశాకే కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని, అలా కాకుండా బరిలో నిలిస్తే నిరుద్యోగులు కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. డిగ్రీ లెక్చరర్ అభ్యర్థి కవిత మాట్లాడుతూ.. జీఓ 4ను రద్దు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడు సోమేశ్‌జాదవ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న నోటిఫికేషన్ కూడా విడుదల చేయాలని కోరారు. శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓయూ నుంచి ఆర్కే టెన్ చోలా, చిక్కడపల్లి నుంచి కిరణ్ రాథోడ్, కయ్య వెంకటేశ్, దిల్‌సుఖ్‌నగర్ నాయకులు నవీన్ యాదవ్, వీరేందర్, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# పవర్‌పేట పడమటవీధి జానకి

'మిరాయ్' 'కొరియన్ కనకరాజు' చిత్రాల ద్వారా యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది ఒరిస్సా సొగసరి రితికా నాయక్. ఆమె సందీప్‌కిషన్‌తో కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'పవర్‌పేట'. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. మంగళవారం రితికా నాయక్ పుట్టిన రోజు సందర్భంగా పడమటవీధి జానకిగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఈ భామ సంప్రదాయ వస్త్రధారణలో చూడముచ్చటగా కనిపిస్తున్నది. రాజకీయ నేపథ్యంలో ఆధిపత్య పోరు, ప్రేమ, గౌరవం ప్రధానాంశాలుగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని, కథాగమనంలో పడమటవీధి జానకి పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, రచనదర్శకత్వం: కృష్ణచైతన్య.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.